క్లుప్తంగా

సంఘ సేవకులకు గొడుగుల పంపిణీ



ట్రస్ట్ అందజేసిన గొడుగులతో సేవకులు

మధురవాడ: సంఘ సేవకులకు జీసస్ మిరాకిల్ చారిటబుల్ ట్రస్ట్ గొడుగులు, ఇతర సామగ్రి పంపిణీ చేసింది. వాంబే కాలనీలో ట్రస్ట్ అధ్యక్షుడు రెవరెండ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సెక్రటరీ లక్ష్మీపట్నాయక్, సభ్యులు గురువారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో సుమారు 60 మంది పాస్టర్లు, ఇతర సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. కళాశాలలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు pgcet-sche.aptonline.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 81797 80917 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు

మధురవాడ: నగరంపాలేనికి చెందిన నాగోతి శివ అనే యువకుడిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పీఎం పాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మిథిలాపురి వుడా కాలనీలోని రోడ్డులో ఓ దుకాణం వద్ద డబ్బుల వ్యవహారంలో తలెత్తిన వివాదంలో మధురవాడకు చెందిన చందు, బాలు అనే ఇద్దరు వ్యక్తులు బుధవారం దాడి చేసినట్లు పీఎం పాలెం పోలీసులకు శివ ఫిర్యాదు ఇచ్చాడు. శివ చికిత్స నిమిత్తం గాయత్రి ఆస్పత్రిలో చేరాడు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కారు



ప్రమాదంలో ముందుభాగం నుజ్జయిన కారు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. సాగర్‌నగర్ మొగదారమ్మ ఆలయ సమీపంలో గురువారం మధ్యాహ్నం కారు అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. నగరం నుంచి రుషికొండ వైపు అతి వేగంగా దూసుకుని వస్తున్న కారు, ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. డివైడర్, డివైడర్‌పై గ్రిల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



వేములవలస కేంద్రంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వీధులలో పారిశుధ్య పనులను, తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. ఎంపీడీవో జానకి ఈ పర్యటనలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి, మజ్జిపేట పంచాయతీలలో రైతులకు ప్రత్యామ్నాయ తడి, ఎండబెట్టడం గురించి ప్రకృతి వ్యవసాయ బృందం గురువారం అవగాహన కల్పించింది. ఆర్‌టీఎల్ ప్రకాష్ మాట్లాడుతూ నీటిని ఆదా చేయడం, విద్యుత్ ఖర్చులను నియంత్రించుకోవడం, తెగుళ్లు తగ్గించి మీథేన్ వాయు ఉద్గారాలు తగ్గించే పైపులను వినియోగించడాన్ని రైతులకు వివరించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా పైపులను మట్టిలో ప్రదర్శించారు. బూట్ లీఫ్ దశ నుంచి పాల దశ వరకు నీటి మట్టం సున్నా స్థాయికి తగ్గి పిండి పరిపక్వత వరకు అంటే పంట కోసే వరకు ఉండాలని సూచించారు.

గుక్కెడు నీటికీ కొండ దిగాల్సిందే..

- బంగ్లామెట్ట పైకి రాని కుళాయి నీరు
- కింది నుంచి బిందెలు, బకెట్లతో మోసుకొస్తున్న మహిళలు
- వర్షం వస్తే మరిన్ని అవస్థలు
- మంచినీటి పథకం నిర్మించాలని వినతులు



బంగ్లామెట్ట గ్రామం



మెట్టపైకి నీరు చేరకపోవడంతో మధ్యలో స్థానికులు కట్ చేసిన పైపులు



కుళాయిల ద్వారా సన్నని ధార

కొండ కింద కుళాయిల ద్వారా వస్తున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు ప్రారంభంలో ఉన్న బంగామెట్టపై నివాసం ఉంటున్న వారికి కుళాయిల ద్వారా గుక్కెడు తాగునీరు చేరడం కూడా బహుకష్టంగా ఉంది. ఈ గ్రామానికి చేరువలోనే గోస్తని నది, మరోవైపు పక్కనే ఉన్న వెంకటేశ్వరమెట్టపై భగీరథ రిజర్వాయర్ ఉన్నా వారి దాహం తీరడం లేదు. కుళాయిలు వచ్చాయంటే మహిళలు నాలుగు బిందెలు పట్టుకుని కొండ దిగవలసిందే. లేదంటే కొండ మధ్య భాగంలో పైపులు కట్ చేసుకుంటే మరో రెండు బిందెల నీరు దొరుకుతుంది. కొండ దిగనివారికి ఆ రోజు గొంతు ఎండినట్టే. ఇక వర్షం పడిందంటే ఆ నాలుగు చుక్కల నీరు తెచ్చుకోవడానికి మహిళలు మరిన్ని ఇబ్బందులు పడాల్సిందే.

కొండ ప్రాంతం చుట్టూ ఈ గ్రామంలో సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. దిగువ భాగంలోని వారికి ఒక మాదిరిగా నీరు దొరుకుతున్నా, పైకి వెళ్లే కొద్దీ తాగునీరు లభించడం కష్టంగా ఉంటోంది. ఇక్కడి వారికి మూడు బిందెలు నిండటమూ కష్టమే. బంగ్లామెట్ట మీదకు చేరడానికి నాలుగు వైపులా మార్గాలు ఉన్నా అన్నీ ఎగుడు దిగుడుగా ఉన్న సీసీ రోడ్లే. ఈ ప్రాంతంలో ఉన్నవారిలో చాలావరకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు, దళితులే. ఎక్కువ మంది కూలిపనులు చేసుకునేవారే.

పైలట్ వాటర్ స్కీమ్ ఏమైంది?

బంగ్లామెట్టపై నివాసాలు ఏర్పాటైన 3 దశాబ్దాలుగా మున్సిపాల్టీ, జీవీఎంసీ అధికారులు కొండపై పైలట్ వాటర్ స్కీమ్ ద్వారా ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతోనే సరిపోయింది. జీవీఎంసీ పరిధిలో ఉన్న వెంకటేశ్వరమెట్ట, కొండపేట, నమ్మివానిపేట, సత్యనారాయణపేట, భీమిలిలోని కొండపేట, గొల్లలపాలెం గ్రామాలలోని కొండలపై వాటర్ ట్యాంకులు ఉన్నా ఒక్క బంగ్లామెట్టపైనే ఆ సదుపాయం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామానికి వచ్చిన ప్రతీసారి ఇక్కడి మహిళలు తాగునీటికి కష్టంగా ఉందని, గతంలో హామీ ఇచ్చిన పైలట్ వాటర్ స్కీమ్ కింద ట్యాంకు నిర్మించాలని అడుగుతున్నా ఘోషే మిగులుతుంది. చాలా వరకు ఇంటింటి కుళాయిలు ఇక్కడ అలంకారప్రాయంగానే కనిపిస్తున్నాయి. కొండపై నాలుగైదు చోట్ల ఖాళీ స్థలాలు కూడా ఉన్నందున ఆ ప్రాంతంలో వాటర్ ట్యాంకులు నిర్మించాలని వారు ప్రతీసారి కోరుతున్నారు. జీవీఎంసీకి తమ గోడు పట్టకపోవడంతో ఉన్న ఖాళీస్థలాలలో సెల్‌ఫోన్ టవర్లు నిర్మించడం, ఇళ్ల స్థలాల పేరుతో కబ్జాకు గురవడం జరుగుతోంది. సుదీర్ఘకాలంగా తాము కోరుతున్న వాటర్ ట్యాంకుతో పాటు కల్యాణ మండపం నిర్మించి, ఖాళీస్థలాలను వినియోగించుకోవాలని బంగ్లామెట్టవాసులు కోరుతున్నారు.



కొండ కింద నుంచి నీరు మోసుకొస్తున్న మహిళ



నీరు రాని కొండ ఎగువ భాగం

నీళ్లు మోయలేకపోతున్నాం



ప్రతి ఉదయం నీళ్లు మోసుకెళ్లడం చాలా కష్టంగా ఉంటోంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ కుళాయిల నుంచి వచ్చే నీరు తగ్గిపోతుంది. ఒక్కోచోట అసలు నీరే రాదు. దీంతో కొండ దిగువ పైపులు కట్ చేసుకుని పైకి మోసుకోవలసి వస్తోంది.

– గరే సంధ్య, బంగ్లామెట్ట

కొండపై ట్యాంకు నిర్మించాలి



బంగ్లామెట్టపై వాటర్ ట్యాంకు నిర్మించి, అక్కడి నుంచి తాగునీరు కుళాయిల ద్వారా సరఫరా చేస్తేనే ఇక్కడి వారికి బాధలు తప్పుతాయి. భీమిలిలో అన్ని ఎత్తయిన కొండలపైనా వాటర్ ట్యాంకులు ఉన్నాయి. మా బంగ్లామెట్ట వాసుల కష్టాలు కూడా అధికారులు, పాలకులు పట్టించుకోవాలి. కొండపై ట్యాంక్ నిర్మించి, నీరు సరఫరా చేయాలి.

– తమ్మిన ఆదిలక్ష్మి, బంగ్లామెట్ట

నీళ్లు మోస్తుంటే ఆయాసం



బిందెలతో నీళ్లు పట్టుకుని కొండపైకి ఎక్కుతుంటే ఆయాసం వస్తోంది. ప్రతి ఇంటికి, వీధికి సాఫీగా నీరు సరఫరా కావాలంటే ధార పెద్దగా రావాలి. మా మహిళల కష్టాన్ని అర్థం చేసుకుని చర్యలు తీసుకోవాలి.

–సమ్మంగి సోమమ్మ, బంగ్లామెట్ట

బంధువులు రావడం మానేశారు



కొండపై తాగునీటికి కష్టంగా ఉండటంతో బంధువులు కూడా రావడం మానేశారు. తిండి, తిప్పల కోసం ఎలాగోలా బాధపడుతున్నా తాగునీరు, వాడుకనీరు ఇవ్వలేకపోతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు నెరవేర్చాలి. మా ప్రాంతంలో తాగునీటి కష్టాలు పరిష్కరించాలి.

– నంద సునీత, బంగ్లామెట్ట

ఆటో కార్మికుల నిరసన

స్త్రీ శక్తి పథకంతో నష్టపోతున్నామని ఆవేదన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు, ఆటో కార్మికులు

భీమునిపట్నం: ప్రభుత్వ మహిళలకు స్త్రీశక్తి పథకం పేరుతో ఉచిత బస్సు సదుపాయం కల్పించడం వల్ల ఆటో కార్మికులు నష్టాలకు గురవుతున్నారని ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.కానుబాబు అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆటో కార్మికుల ఆదాయం ఈ పథకం వల్ల పూర్తిగా పడిపోయిందన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు చెల్లించలేకపోతున్నారని, నిత్యావసర సరకుల కొనుగోలు కూడా కష్టంగా ఉంటోందని తెలిపారు. మ్యాక్సి క్యాబ్ నిర్వాహకుల పరిస్థితి కూడా ఇలాగే ఉందని, దీనిపై ప్రభుత్వ చర్యలు తీసుకోకుంటే పరిస్థితి అధ్వానంగా ఉంటుందన్నారు. ఆటో కార్మికులకు, మ్యాక్సీ క్యాబ్ నిర్వాహకులకు పెట్రోల్, డీజిల్‌పై 50శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారిపై ఇష్టానుసారంగా పెడుతున్న కేసులను ఎత్తేయాలన్నారు. ఆటో కార్మికులకు న్యాయం చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోర అప్పలరాజు, సందీప్, నూకరాజు, గురుమూర్తి, ధనరాజ్, శివ, చిన్నారావు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాట

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలకు చిట్టివలస రెడ్డివీధిలో గురువారం ఉత్సవరాట వేశారు. గ్రామానికి చెందిన ప్రజలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు డీవీ చలపతి రావు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విినీలాకాశంలో వెలుగుల రేడు



వినీలాకాశంలో వెలుగుల రేడు కనువిందు చేశాడు. కడలిలో తన ప్రతిబింబాన్ని చూసుకునేందుకు నల్లని మేఘాల మాటునుంచి వచ్చి అరుణ కాంతులతో ప్రకాశిస్తున్నాడా అన్నట్లుగా ఈ దృశ్యం ముగ్ధమనోహరంగా కనిపించింది. సందర్శకుల మదిని దోచిన జాబిలి సోయగం మంగమారిపేట తీరం వద్ద దర్శనమిచ్చింది.

– కొమ్మాది

ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకుడిపై కేసు నమోదు

మధురవాడ: మధురవాడ జాతీయ రహదారిపై కార్ రెండు డోర్లు తెరిచి, ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకుడిపై పీఎం పాలెం పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై అత్యంత రద్దీగా ఉన్న సమయంలో కారు రెండు డోర్లు తెరచి, ఫొటోలు తీసుకుంటూ దురుసుగా, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పత్రికల్లోనూ వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన పీఎం పాలెం పోలీసులు కారును స్వాధీనం చేసుకుని, డ్రైవ్ చేసిన మధురవాడకు చెందిన పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. అయితే కారుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోతో పాటు ఓజీ పేరు కూడా ఉండడంతో జనసేన అనుచరులే ఇందులో ఉన్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కూటమి నేతల ఒత్తిడితోనే పోలీసులు వివరాలు గోప్యంగా ఉంచుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలోకి ఈ వీడియోలు, ఫొటోలు రాకుండా ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు తీవ్ర ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం.



పీఎం పాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

శ్రీబాసరలో మహిళల వరల్డ్‌కప్ ట్రోఫీ ప్రదర్శన

తగరపువలస: స్థానిక శ్రీబాసర లీడ్స్ స్కూల్లో డీపీ వరల్డ్ వారి ఐసీసీ ఉమెన్స్ క్రికెట్ కప్ ట్రోఫీని గురువారం ప్రదర్శించారు. ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీ టూర్ మేనేజర్ జైద్ మాట్లాడుతూ మహిళల క్రికెట్ కప్ ప్రాముఖ్యత, ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్రీడలపై జ్ఞానాన్ని పెంచడానికి వివిధ ఆటల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, డీన్ ఎం.భాస్కరరావు, ప్రిన్సిపాల్ రేఖ, హెచ్ఎం కేశవ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీబాసర లీడ్స్ స్కూల్‌లో ఐసీసీ ఉమెన్స్ ట్రోఫీ ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు



పోటీల్లో నృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థలో ఉమ్మడి విశాఖ జిల్లా కళా ఉత్సవ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీసే అవకాశం ఏర్పడుతుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ మాట్లాడుతూ తొలిరోజు 45 పాఠశాలలు, కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నృత్యం, పాటల పోటీల్లో ప్రతిభ ప్రదర్శించారని.. ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థులకు ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రశంస పత్రాలను అందించారు.

యువతను ప్రోత్సహించేందుకే పోటీలు

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర
- ముగిసిన చిన్నశ్రీను ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



ఫైనల్ పోటీలకు టాస్ వేస్తున్న సిరి సహస్ర



విజేతలతో సిరి సహస్ర

భీమునిపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువతను ప్రోత్సహించేందుకే క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర (సిరమ్మ) అన్నారు. మజ్జి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని గత నెల 29న భీమిలి వుడా మైదానంలో ప్రారంభమైన చిన్న శ్రీను ప్రీమియర్ లీగ్ (సీఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సిరి సహస్ర మాట్లాడుతూ యువతలో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు విజయనగరం జిల్లాలో పలు పోటీలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా భీమిలి పరిధిలోనూ తరచూ పోటీలు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. పోటీల్లో గెలుపు, ఓటములు చూడకుండా అందరూ క్రీడాస్ఫూర్తితో ఆడారని అభినందించారు.

సీఎస్‌పీఎల్ విజేత జీపీపీ ఎలెవెన్స్

పోటీల్లో 16జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో ఆనందపురం మండలం, గుమ్మడివానిపాలేనికి చెందిన జీపీపీ ఎలెవెన్స్ జట్టు, పద్మనాభం మండలం రేవిడికి చెందిన ఆర్‌వీపీ రైడర్స్ జట్టు తలపడ్డాయి. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌వీపీ రైడర్స్ ఎనిమిది ఓవర్లకు 65 రన్స్ తీసి ఆలౌట్ కాగా, తర్వాత బ్యాటింగ్ చేసిన జీపీపీ ఎలెవెన్స్ జట్టు నాలుగు బాల్స్ మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విన్నర్స్ జట్టుకు కప్, రూ. 50వేల నగదు ప్రోత్సాహక బహుమతి, రన్నర్స్ జట్టుకు రూ 30 వేలు, మూడో స్థానంలో నిలిచిన రేవిడి కింగ్స్ జట్టుకు రూ.15వేలు అందించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, జీరు వెంకటరెడ్డి, ఎస్.కరుణాకరరెడ్డి, సిల్లవంశీ, చందక సత్యం, పిన్నింటి వెంకటరమణ, పొంద్రంగి శ్రీను, గుండాసి మధునాయుడు, కోరాడ వెంకటరమణ, అక్కరమాని కిరణ్, మజ్జి వెంకటరావు, ఇల్లాపు వెంకటరావు, చిల్ల సూరిబాబు వెంకట రాంబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి



సంగివలసలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: గర్భిణులు విధిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ సూచించారు. గర్భధారణ తొలి త్రైమాసికంలోనే బిడ్డకు సంక్రమణ వ్యాధుల నుంచి రక్షణకు ఈ పరీక్షలు అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో గురువారం చిట్టివలస, సంగివలస గ్రామాలలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 45 మంది గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



మద్ది హైస్కూల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఆర్.మహేష్ ఏడు రోజులు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 12న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన చేపడతామన్నారు. 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. 15న పాత తాలుకా కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లోను నిరసన ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్‌లు, ఈ మెయిల్ పంపిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, మెమో 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, యాప్‌లు, అసెస్‌మెంట్ బుక్ లెట్ విధానాలను రద్దు చేయాలని కోరుతూ ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బోని సూర్యనారాయణ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి కె.గౌరినాయుడు పాల్గొన్నారు.

మళ్లీ చెరువులా హైస్కూల్ గ్రౌండ్



చంద్రంపాలెం హైస్కూల్లో మునిగిపోయిన బాస్కెట్ బాల్ కోర్టు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడామైదానం తీరు ఏమాత్రం మారలేదు. ప్రణాళికాబద్ధంగా లేకుండా చేస్తున్న పనుల వల్ల ఈ సారి ఎంతో ఎత్తులో ఉన్న బాస్కెట్ బాల్ కోర్టు కూడా చిన్న వర్షానికే నీట మునిగిపోయింది. దీంతో ఆటలాడుకునేందుకు మైదానానికి వచ్చిన క్రీడాకారులు నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది.